క్లుప్తంగా

బుద్ధ జయంతి నేడు



ముస్తాబైన బుద్ధుని విగ్రహం

కంచరపాలెం: ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం వైశాఖ పౌర్ణమి బుద్ధ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యూత్ సెంటర్ గౌరవ అధ్యక్షుడు, సమాజం కార్యదర్శి కె.రాజు గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా బౌద్ధ భిక్షువులచే బౌద్ధ సూక్తులతో పూజలు, ప్రసాద వితరణ, అనంతరం వృద్ధులకు చీరల పంపిణీ, పేదలకు అన్నదానం, చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బౌద్ధాలయం, బుద్ధుడి విగ్రహానికి రంగులు వేసి సుందరంగా అలంకరించామన్నారు.

గవర కమ్యూనిటీ కన్వీనర్‌గా కాండ్రేగుల



వెంకట్రావ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

కంచరపాలెం: విశాఖ టీడీపీ పార్లమెంట్ జిల్లా గవర కమ్యూనిటీ కన్వీనర్‌గా కాండ్రేగుల వెంకట్రావ్ నియమితుయ్యారని పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం కాండ్రేగుల వెంకటరావును పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. కార్యక్రమంలో మళ్ల సురేంద్ర, వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, రాష్ట్ర నాయకులు మల్ల శంకరరావు, బుద్ద శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ బాక్సర్లకు పౌష్టికాహారం పంపిణీ



జూనియర్ బాక్సర్లతో మజ్జి సోమేష్

మల్కాపురం: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా 60వ వార్డు గుల్లలపాలెంలో పార్కులో బాక్సింగ్ శిక్షణ పొందుతున్న వారికి 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్‌లు, పలువురు సీనియర్ బాక్సర్లు పాల్గొన్నారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న జియ్యాని



ముత్యాలమ్మ సన్నిధిలో జియ్యాని శ్రీధర్ తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు గణేష్‌నగర్‌లో ముత్యాలమ్మ అమ్మవారిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

పరామర్శ

సింధియా: జీవీఎంసీ 62వ వార్డుదుర్గానగర్‌లో నివాసముంటున్న సీనియర్ జర్నలిస్ట్ కొయిలాడ పరశురామ్‌ను గురువారం పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ పరామర్శించారు. శస్త్ర చికిత్స అనంతరం ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న పరశురామ్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీఎం సహాయనిధి నుంచి సహకారం అందించేందుకు ప్రయత్నిస్తానని భరోసా కలిగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, సోమునాయుడు, భీశెట్టి గణేష్, గుడాల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్... టెన్షన్

- కంచరపాలెం వై జంక్షన్‌లో గందరగోళంగా వాహనాల రాకపోకలు
- దిష్టిబొమ్మల్లా ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాలు
- కానరాని జీబ్రా క్రాసింగ్స్ జాడ
- ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహన చోదకులు



ప్రమాదకరంగా వై జంక్షన్ రహదారులు



వాహనాల రద్దీతో కంచరపాలెం కూడలి

కంచరపాలెం: కంచరపాలెం మెట్టు వై జంక్షన్‌లో ట్రాఫిక్ చిక్కులు అధికమవుతున్నాయి. ఇక్కడి నేతాజీ ఫ్లైఓవర్ వంతెన కూడలి ముత్యమాంబ ఆలయం వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూడలి నుంచి అటు జ్ఞానాపురం, ఇటు తాటిచెట్లపాలెం వెళ్లే వాహనాలు కూడలి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం జన సంచారం ఎక్కువగా ఉంటుంది. స్కూల్స్ జోన్ ఉన్నా.. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్స్ జాడే కనపడటం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ వాహనాలతో ఈ వై జంక్షన్ కిటకిటలాడుతుంటుంది. భారీ వాహనాలు నిషిద్ధ సమయాల్లో నగరంలోకి పంపకుండా ఇక్కడే నిలిపివేస్తుంటారు. దీంతో అనేక వాహనాలు రహదారిపై ఆగిపోతుంటాయి. ఇక్కడ నుంచి తొందరగా వెళ్లాలని ప్రయత్నిస్తున్న పలువురు వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి సరిపడ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది లేకపోవడంతో సమస్య తీవ్రంగా ఉంది. నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు ప్రయాణించేటప్పుడు ప్రమాదాలను ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు.

పూర్తికాని బీఆర్‌టీఎస్..

కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ నుంచి ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ వరకు చేపట్టిన బీఆర్‌టీఎస్ రహదారులు పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తోపుడుబళ్లు, చిల్లర వర్తకులు రోడ్లపై వ్యాపారాలు చేస్తుండడంతో రహదారులు కుదించుకుపోతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ట్రాఫిక్ మరింత జఠిలమవుతోంది. కూడలిలో ఫుట్‌ఫాత్‌లపై వ్యాపారాలు చేస్తున్నవారికి హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ నియంత్రించవచ్చునని స్థానికులు చెబుతున్నారు.

ఆటోలతో ట్రాఫిక్‌కు అడ్డంకులు.

ఇక్కడ ఉన్న ముత్యమాంబ ఆలయ ప్రాంగణంలో ఆటోస్టాండ్ వద్ద ఆటోలను అడ్డంగా నిలుపుదల చేస్తూ బేరసారాలు చేస్తున్నా, ట్రాఫిక్ సిబ్బంది మాత్రం తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. పండగలు, సంబరాలు, జాతరల సమయాల్లో మాత్రమే పోలీసు యంత్రాంగం ట్రాఫిక్ క్రమబద్ధీకరించే చర్యలు తీసుకుంటున్నారు తప్ప మిగతా సమయంలో అసలు పట్టించుకోవడం లేదు. ఇటీవల కాలంలో ఇక్కడ పోలీస్ కంట్రోల్ పోస్టును ఏర్పాటు చేసినా నామమాత్రంగానే పని చేస్తోందని, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్ల అప్పారావు ప్రమాదాల నియంత్రణపై కౌన్సెలింగ్ ఇస్తున్నా డ్రైవర్లలో ఎలాంటి మార్పురావడంలేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు

జంక్షన్ దాటాలంటే భయం

పాఠశాలకు వెళ్లేటప్పుడు వై జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో రోడ్డు దాటాలంటేనే భయం వేస్తోంది. పెద్దల సహాయంతో రోడ్డు దాటుతున్నాం. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసులను నియమించాలి.

– పి.పద్మప్రియ, విద్యార్థిని, కంచరపాలెం

పిల్లలను పంపాలంటే ఆందోళన

కొండవాలు ప్రాంతాల్లో ఉన్నత పాఠశాలల లేకపోవడంతో పిల్లలను కంచరపాలెం కూడలిలో పాఠశాలలకు పంపుతున్నాం. కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో రోడ్డు దాటుతున్నప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారులపై నడవాలంటేనే చిల్లర వర్తకలు, తోపుడుబళ్లతో ఇబ్బందికరంగా ఉంటుంది.

– కె.ఆర్.గణేష్, అశోక్‌నగర్

ట్రాఫిక్ సిబ్బందిని నియమించండి

కంచరపాలెం మెట్టు వై జంక్షన్‌లో భారీ వాహనాలు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణిస్తున్నాయి. రహదారులను దాటుకుని ప్రయాణించాలంటే నరకయాతన తప్పడం లేదు. ట్రాఫిక్ సిబ్బందిని మరింత పెంచాలి. సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. ప్రమాదాలబారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి.

– జి.వీరలక్ష్మి, గణేష్‌నగర్

అభివృద్ధి, సంక్షేమమే జగనన్న ధ్యేయం



విమాన్‌నగర్‌లో మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: అభివృద్ధి, సంక్షేమంపై విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ అన్నారు. 90వ వార్డు విమాన్‌నగర్‌లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200కు పైగా ఇళ్లకు ఆయన వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరికీ మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మనమంతా అండగా నిలవాలని కోరారు. ఆదారికి అడుగడుగునా హారతులిచ్చి జనం నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఇటీవల శ్రీకాకుళంలో హార్బర్, భోగాపురంలో ఎయిర్‌పోర్టు, విశాఖలో అదాని డేటా సెంటర్ల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేయడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. దీనివల్ల ఎంతో మందికి ఉపాధి, ఉద్యోగాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి, సీనియర్ నాయకుడు నమ్మి శ్రీను, యల్లపు వెంకటేశ్వరరావు, అప్పలరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలువురికి టిడ్కో ఇళ్లకు సంబంధించిన చెక్కులను గురువారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ పంపిణీ చేశారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 31 మందికి సుమారు 8.41 లక్షల నగదును చెక్కుల రూపంలో ఆనంద్‌కుమార్ అందజేశారు. త్వరలో ఇళ్ల తో పాటు రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో భీశెట్టి గణేష్, మసేనమ్మ, భారతి, కమలమ్మ, రావాడ అప్పారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు పనుల ప్రారంభానికి వినతి



సీజీఎంకు సమస్య వివరిస్తున్న పైడిరాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులకు చెందిన నూతన కాంట్రాక్టు పనులను సత్వరం ప్రారంభించాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు కోరారు. స్టీల్‌ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ (వర్క్స్) బి.కె. మొహంతిరి గురువారం ఆయన కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. 142 మంది కాంట్రాక్టు కార్మికులు నెల రోజులుగా పనులు లేక పస్తులు ఉంటున్నారన్నారు. యాజమాన్యం చొరవ తీసుకుని తాత్కాలికంగా 30 రోజులకు కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడం అభినందనీయమన్నారు. దానికి సంబంధించిన సేఫ్టీ ట్రైనింగ్ కూడా పూర్తయిందన్నారు. పనులను వెంటనే ప్రారంభించేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని కోరారు.

ఎన్‌ఎస్‌టీఎల్ పనులకు సహకారం



ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

గోపాలపట్నం: ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై. శ్రీనివారావుతో జీవీఎంసీ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ గురువారం ఎన్‌ఎస్టీఎల్‌లో భేటీ అయ్యారు. బుచ్చిరాజుపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న పార్క్‌లో ఎన్‌ఎస్‌టీఎల్ విశిష్టతకు అద్దంపట్టే విధంగా నమూనా ఏర్పాటు చేయడంపై ఆయనతో చర్చించారు. జీవీఎంసీ, ఎన్‌ఎస్టీఎల్ సంయుక్తంగా ఈ పార్క్‌ను అభివృద్ధి చేయనున్నాయని బొమ్మిడి రమణ తెలిపారు. ఎన్‌ఎస్టీఎల్ నమూనా ఏర్పాటు చేసేందుకు జీవీఎంసీ తరఫున సహకారం అందిస్తానని పేర్కొన్నారు. త్వరలో అధికారులతో పర్యవేక్షిస్తామని తెలిపారు. ఆయనతో పాటు స్థానిక నాయకుడు నరవ పైడిరాజు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగండి

మల్కాపురం: స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా మెలగాలని హార్బర్ ఏసీపీ మోసెస్ పాల్ సూచించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం సాయంత్రం మల్కాపురం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పెండింగ్ కేసులను పరిశీలించారు.అలాగే నేర చరిత్ర ఉన్న వారి వివరాలు తెలుసుకున్నారు.సీఐ లూథర్‌బాబు,ఎస్ఐ దేవుడమ్మ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



లక్ష్మణరావు మృతదేహం

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డులో గురువారం రాత్రి ఓ వ్యక్తి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆవ్యక్తిని ఎవరో తలపై కొట్టి చంపారని స్థానికులు అనుమానిస్తుండగా.. వాహనం ఢీ కొట్టడం వల్లే ఆ వ్యక్తి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.దీనిపై మల్కాపురం సీఐ లూథర్‌బాబు తెలిపిన వివరాలు ..జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రకాష్‌నగర్‌లో కోన లక్ష్మణ్ (41) భార్యా పిల్లలతో కలిసి నివాసం ఉండేవాడు. అయితే ఇటీవల భార్యాభర్తలు గొడవ పడడంతో పిల్లలను అత్త ఇంటి వద్ద వదిలి లక్ష్మణ్ భార్య పుట్టింటికి వెళ్లింది. ఇది ఇలా ఉండగా లక్ష్మణ్ గురువారం రాత్రి 8 గంటల సమయంలో పూటుగా మద్యం సేవించి ఆర్కే పురం సెయింట్ జోసెఫ్ పాఠశాల మార్గంలో ప్రకాష్‌నగర్‌లోని తన ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం లక్ష్మణ్‌ను ఢీ కొట్టి తలపై నుంచి వెళ్లడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు చెబుతున్నారు. కాగా స్థానికవాసులు మాత్రం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పూర్తి విచారణ చేపడుతున్నమని సీఐ లూథర్‌బాబు తెలిపారు.శవ పంచానామా నిమిత్తం మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ చెప్పారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



దస్తూరిపై శిక్షణ పొందుతున్న చిన్నారులు

కంచరపాలెం: ఊర్వశి కూడలి కంచరపాలెం బొట్టా నర్సింగరావు భవనంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, బీఎస్ఆర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో గురువారం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ నెల 31 వరకు నిర్వహించ ఈ శిబిరాల్లో విజ్ఞానంతో కూడిన వినోదత్మాక అంశాలపై శిక్షణ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కంచరపాలెం జోన్ కమిటీ సభ్యుడు కృష్ణారావు కోరారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి



మహిళకు ఇంటి పట్టా ఇస్తున్న పశ్చిమ సమన్వయ కర్త ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: అర్హులైన పేదలందరికీ సొంతగూడు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 59వ వార్డు పరిధి వాయుపుత్రకాలనీ,నక్కవానిపాలెం సచివాలయాల పరిధిలో అర్హులైన పేదలకు గురువారం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి పేద వాడు సంపూర్ణహక్కుతో దర్జాగా జీవించేలా ఇంటి పట్టా ఇచ్చారన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా వారి పేరుపై రిజిస్ట్రేషన్ చేసి భవిష్యత్తులో విక్రయించుకోవడానికి కూడా జగనన్న అవకాశం కల్పించారని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం చిన్న పిల్లలకు బిల్లలు పంచినట్టు ప్రతి ఒక్కరికీ పట్టాలు ఇచ్చిందని, ఆ పట్టాలు పొయ్యిలో పెట్టుకోడానికి తప్పా దేనికి పనికి రాలేదని విమర్శించారు. ఇళ్లు లేని నిరుపేదలను నమ్మించిన చంద్రబాబు లాంటి మోసగాడు ఈ రాష్ట్రానికి కావాలా, ఇచ్చిన మాటకు కట్టుబడి పేద వాని సొంత ఇంటి కల నెరవేర్చిన జగనన్న కావాలో ప్రతి పేదవాడు ఆలోచన చేయాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఆ పార్టీ నాయకులు ,జన్మభూమి కమిటీ సూచించిన వారికి మాత్రమే ఇళ్లు ఇచ్చేవారని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కులం ,మతం ,పార్టీ చూడకుండా కేవలం అర్హత ఉంటే సొంత ఇల్లు మంజూరు చేశారన్నారు.కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, పార్టీ వార్డు ఇన్‌చార్జి రేవళ్ల సత్యనారాయణ,భూపతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో పారిశుధ్య కార్మికులు కీలకం



పారిశుధ్య కార్మికులకు శానిటరీ సామగ్రి అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు కీలకమని జీవీఎంసీ 62వ వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు అన్నారు. వార్డు పరిధిలోని దుర్గానగర్‌లో గురువారం కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులు ప్రతి ఒక్కరికీ 4 లీటర్ల కొబ్బరి నూనె, గ్లౌజులు, జాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచడమేకాక వారి భద్రత దృష్ట్యా పలు సంక్షేమ పథకాలు, వైద్య సదుపాయలను అందబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో వార్డు హెల్త్ అసిస్టెంట్ నవరత్నం, మేస్త్రీ రమణ, సూపర్‌వైజర్ గంట్యాడ గోవింద్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్యస్వామికి పౌర్ణమి పూజలు



సుబ్రహ్మణ్య స్వామి

కంచరపాలెం: వైశాఖ పౌర్ణమిను పురస్కరించుకుని ఈ నెల 5 నుంచి 7 వరకు ఊర్వశి జంక్షన్ రవీంద్ర నగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవాల రాజుకృష్ణ తెలిపారు. ఆలయంలో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, మండపారాధన, ముత్తయిదువుల చేతుల మీదుగా ఊంజల్ సేవ జరుగుతాయని చెప్పారు. అనంతరం స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు, స్కందవేద హోమం తదితర పూజలు చేస్తామన్నారు. 6న సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు, 7న ఆదివారం మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం , సాయంత్రం స్వామి తిరువీధి మహోత్సవం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించామని చెప్పారు. కార్యక్రమంలో కాండ్రేగుల రాము, సిహెచ్.కుమారి, కె.రవి, సిహెచ్.సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

- యూపీహెచ్‌సీ వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో



ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది అందరూ సమయపాలన తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. మద్రిపాలెం శివనగర్ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడుతూ అన్ని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బర్త్ ప్లానింగ్ గురించి, హై రిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్ల సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలన్నారు. సాధారణ ప్రసవాలు అయ్యేలా ప్రోత్సహించాలని, శస్త్రచికిత్స ప్రసవాలను తగ్గించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది అందరూ డ్రెస్ కోడ్ పాటించాలని పలు సూచనలిచ్చారు. యూపీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు ఆరోగ్యంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మకుమారీలు

మల్కాపురం: బాలికలు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధి సింధూ అన్నారు. ధ్యానంతోనే ఆరోగ్యం, ఆనందం లభిస్తుందని చెప్పారు. శ్రీహరిపురంలోని సంస్థ కార్యాలయంలో గురువారం బాలికలకు మంచి ఆలోచనలతో మెలగడం ఎలా.. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగహన కల్పించారు. ఒత్తిడితో కూడిన చదువుల వల్ల నేటి బాలికల ఆలోచనలు వేరే విధానానికి దారి తీస్తున్నాయన్నారు. ఇటువంటి వారు ఉదయం లేదా సాయంత్రం 30 నిమిషాల పాటు ధ్యానం చేస్తే మనసుకు ప్రశాంతత కలిగి ఒత్తిడిని మరిచిపోతారన్నారు. చెడు ఆలోచనలకు దూరంగా ఉంటామన్నారు. ప్రతి ఒక్క బాలిక ఈ విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

కార్మికుల సంక్షేమాన్ని ఆలోచించాలి

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్మిక సంక్షేమానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమంపై కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 812వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం స్టోర్స్, ఎస్ఎండీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడితే, దాని ఫలితంగా మౌలిక సదుపాయాల కల్పనలన్నీ ఆ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. దీంతో ప్రజలపై భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి, వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.